నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

అల్వాల్‌: విద్యుత్‌ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. భూదేవినగర్‌ సబ్‌స్టేషన్‌ 11కేవీ యాదమ్మనగర్‌ ఫీడర్‌ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రీన్‌ఫీల్డ్‌ కాలనీ, ముత్యంరెడ్డి నగర్‌, శివ నగర్‌, టెలికాం కాలనీ, సన్‌రైజ్‌ ఎన్‌క్లేవ్‌, హేమా నగర్‌, పద్మావతి కాలనీ, కానాజిగూడ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా అల్వాల్‌ సబ్‌స్టేషన్‌ 11కేవీ హెచ్‌ఎంటీ ఓఫీసర్స్‌ కాలనీ ఫీడర్‌ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు హెచ్‌ఎంటీ, పంచశీల్‌ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.
మేడిపల్లి: 11కేవీ ఎస్‌ఐఎస్‌ ఫీడర్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవి పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో గురువారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్దా నగర్‌, మల్లికార్జున నగర్‌, వరంగల్‌ హైవే ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.
◆ 33/11 కేవి పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, భరత్‌పురి కాలనీ, కమలానగర్‌, వరంగల్‌ హైవే ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నారు.

11 కేవీ ధరణి ఫీడర్‌ పరిధిలో..

33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో సాయంత్రం 4 గంటల నుండి 5.30 గంటలవరకు ఫీఅండ్‌టీ కాలనీ భరత్‌ నగర్‌, బుద్దా నగర్‌లలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్‌ సగ్గ ఓ ప్రకటనలో కోరారు.

21న వాహనాల వేలం

గౌతంనగర్‌: ఎక్సైజ్‌ కేసులలో పట్టుబడిన రెండు వాహనాలకు ఈ నెల 21న శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు మల్కాజిగిరి అబ్కారీ స్టేషన్‌ సీఐ చంద్రశేఖర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. మల్కాజిగిరి ఎక్సైజ్‌ స్టేషన్‌ ఆవరణలో ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఆధ్వర్యంలో ఒక ద్విచక్ర వాహనం, ఒక ఆటోకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేల డిపాజిట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని ఆనంద్‌బాగ్‌లోని మల్కాజిగిరి అబ్కారీ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు - 8712658737, 9533551949 లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


శ్రీజ (ఫైల్‌)

కుషాయిగూడ: విద్యుదాఘాతంతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అశోక్‌నగర్‌కు చెందిన ఇసాక్‌ కుమార్తె శ్రీజ (10) 5వ తరగతి చదువుతోంది. ఉదయం నీళ్ల వేడి చేసుకునేందుకు హీటర్‌ ఆన్‌ చేసింది. హీటర్‌ ఆన్‌లో ఉండగానే నీళ్ల వేడయ్యాయో లేదో చూసేందుకు బకెట్‌లో చేయి పెట్టింది. దీంతో ఒక్కసారిగా కరెంట్‌ షాక్‌ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. తండ్రి పెయింటింగ్‌ పనికి వెళ్లగా, తల్లి అనిత పెద్ద కూతురితో కలిసి కాలేజీ వద్దకు వెళ్లింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

24 నుంచి కీసరగుట్టలో క్రీడా పోటీలు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 24 నుంచి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు, యువకులకు గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మేడ్చల్‌-మల్కాజ్‌గిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఈనెల 24 నుంచి రెండురోజుల పాటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్‌ పోటీలు, 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు యువకులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 23లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్‌ 8106252751 ఫోన్‌ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. అక్రమ నిర్మాణలపై ఆందోళన చేపట్టేందుకు బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, మాస్టర్‌ ప్లాన్‌లోని రహదారులు అన్యాక్రాంతమవుతున్నా మున్సిపల్‌ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల వైఖరికి నిరసనగా పోచారం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట రెండు రోజుల పాటు ఆందోళన చేపట్టాలని తీర్మానించామన్నారు. సీపీఎం నాయకులు చింతల యాదయ్య, ఎస్‌.సబిత, యాదగిరి, కొయ్యడ చంద్రమోహన్‌, అరుణ, సునీత పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి


క్రెడిట్‌ ప్లాన్‌ కరదీపికను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌ రెడ్డి తదితరులు

- పొటెన్షియల్‌ లింక్డ్‌ క్రెడిట్‌ ప్లాన్‌ కరదీపిక ఆవిష్కరణ
- ప్రాధాన్యతా రంగాలకు వార్షిక రుణం అంచనా రూ.28157 కోట్లు


సమావేశానికి హాజరైన వివిధ బ్యాంకుల అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక సంవత్సర ముగిసేలోగా విద్యా, గృహ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌, డీసీసీ చైర్మన్‌ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డీసీసీ, డీఎల్‌ ఆర్సీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మూడో త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ సంక్షేమ శాఖల ద్వారా ఆర్థిక సంవత్సర ముగింపులోగా విద్యా, గృహ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకర్లను సూచించారు. వార్షిక రుణ ప్రణాళిక కింద బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ఎజెండా తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.

కరదీపిక ఆవిష్కరణ

రాబోవు 2025-26 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్‌ ద్వారా పొటెన్షియల్‌ లింక్డ్‌ క్రెడిట్‌ ప్లాన్‌ కరదీపికను జిల్లా అదనపు కలెక్టర్‌ ఆవిష్కరించారు. నాబార్డ్‌ ప్రతి జిల్లాకు ఏటా పొటెన్షియల్‌ లింక్డ్‌ క్రెడిట్‌ ప్లాన్‌ పీఎల్‌పీని సిద్ధం చేస్తోంది. ప్రాధాన్యతా విభాగంలో మేడ్చల్‌ జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. దీనిని ఆధారంగా చేసుకుని లీడ్‌ బ్యాంక్‌ జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీని ప్రకారం మేడ్చల్‌కు సంబంధించిన 2025-26 పీఎల్‌పీని అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు.

ప్రాధాన్యతా రంగాలకు రూ.28157 కోట్లు

పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్‌ కోసం రుణం రూ.469.66 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్‌ లోన్‌ రూ.893.53 కోట్లు, వ్యవసాయం మౌలిక సదుపాయాల కోసం రూ.246.31 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ.1383.58 కోట్లు, సూక్ష్మ చిన్న , మధ్య తరహా సంస్థల కోసం రూ.23042.33 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగ రుణాలు , విద్య, హౌసింగ్‌, సోషల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌, రెన్యూవబుల్‌ ఎనర్జీ తదితర విభాగాలకు రూ.2121.73 కోట్లతో సహా జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగానికి రూ.28157.15 కోట్లు రుణ లక్ష్యంగా ప్రతిపాదనలు రూపొందించారు. సమావేశంలో నాబార్డ్‌ డీడీఎం అఖిల్‌,ఆర్బీఐ ఎల్‌డీఎం శివ ప్రసాద్‌, ఆర్బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు వినోద్‌కుమార్‌ ,ఝాన్సీరాణి, బ్యాంక్‌ డిస్ట్రిక్ట్‌ కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని బ్యాంకులు చురుగ్గా రుణాలిచ్చి 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కలెక్టర్‌ సూచించారు.

ప్రజల సహకారంతోనే నగర అభివృద్ధి

- నూరుశాతం పన్ను వసూలు లక్ష్యంగా పనిచేయాలి
- పీర్జాదిగూడ కమిషనర్‌ త్రిలేశ్వర్‌ రావు


ట్రేడ్‌ లైసెన్స్‌ వసూలు కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్‌ త్రిలేశ్వర్‌ రావు

మేడిపల్లి: ప్రజల సహకారంతోనే నగర అభివృద్ధి సాధ్యమని పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కమిషనర్‌ త్రిలేశ్వర్‌ రావు అన్నారు. బుధవారం ఆయన కార్పొరేషన్‌ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, వార్డు ఆఫీసర్లతో కలిసి పన్ను వసూలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ నగర పరిధిలో వంద శాతం పన్నులను వసూలు చేయడం ద్వారా నగరాభివృద్ధికి బాటలు వేయాలన్నారు. వ్యాపార ట్రేడ్‌ లైసెన్స్‌లను గడువులోగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. నగర ప్రజల సహకారంతోనే కార్పొరేషన్‌ అభివృద్ధి సాధ్యమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తమ భవన అనుమతులు, వ్యాపార అనుమతుల సంబందిత ఫీజులు సమయానికి చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.అధికారుల కృషి, ప్రజల భాగసామ్యంతో సకాలంలో పన్నుల వసూలు లక్ష్యాలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు సహకరించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బాలలక్ష్మి

బోడుప్పల్‌: వివిధ కారణాల వల్ల గతంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనని వారందరూ సారి నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని అధికారులకు సహకరించాలని రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యురాలు బాల లక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో భాగంగా బుధవారం ఆమె బోడుప్పల్‌లో పర్యటించారు. బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ, మల్కాజిగిరి జిల్లా బీసీ వెల్ఫేర్‌ ఆఫీసర్‌, సర్వే సూపర్‌ వైజర్లు, ఎన్యూమరేటర్లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈనెల 28 వరకు సర్వే కొనసాగుతుందని, గత సర్వేలో పాల్గొనని వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్‌, బోడుప్పల్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, అసిస్టెంట్‌ కమిషనర్‌ శ్యాంసుందర్‌, మేనేజర్‌ ప్రవీణ్‌, రెవెన్యూ అధికారులు విజయేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

శివాజీ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి

మౌలాలి: యువత ఛత్రపతి శివాజీ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వినాయకనగర్‌ డివిజన్‌లోని కాకతీయనగర్‌లో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన మోటార్‌ సైకిల్‌ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ శివాజీ గొప్ప యోధుడని, ధైర్యం, ధర్మం, శక్తి చతురతతో శక్తివంతమైన సామ్రాజ్యాన్ని నిర్మించారన్నారు. శత్రువులతో పోరాడుతూనే మరో వైపు హైందవ స్వరాజ్యం కోసం ఆహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు.

ఆర్టీసీ కాలనీ హనుమాన్‌ నగర్‌లో..

మౌలాలి డివిజన్‌ ఆర్టీసీ కాలనీలోని హనుమాన్‌ నగర్‌లో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు శివగౌడ్‌, నాయకులు శ్రీనివాస్‌యాదవ్‌, వెంకటేష్‌, విఠోభా, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన


అన్నదానం చేస్తున్న దృశ్యం

అల్వాల్‌: ఓల్డ్‌ అల్వాల్‌లోని శ్రీసాయి బృందావన్‌ కాలనీ జొన్నబండ శ్రీషిరిడి సాయి దత్త దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణ కర్త, దాత మాచిరాజు జోగిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రఘుపతి రెడ్డి, ఎల్లారెడ్డి, రాంచందర్‌గౌడ్‌, శ్రీనాథ్‌, ప్రధాన అర్చకులు రాఘవశర్మ పాల్గొన్నారు.

నీటి సమస్య నివారణకు నిరంతర పర్యవేక్షణ

శివారుల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- వేసవిలో ప్రతిరోజూ మానిటరింగ్‌
- స్పెషల్‌ ఆఫీసర్ల నియామకం
- బోర్లు ,చేతిపంపుల మరమ్మతులు
- జీపీలు, పురపాలక సంఘాల్లో అదనపు వాటర్‌ ట్యాంకులు
- అవసరమైతే అద్దెకు తీసుకునేందుకు వ్యవసాయ బోర్ల గుర్తింపు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివార్లలోని 13 పురపాలక సంఘాలు , 34 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రత్యేక యాక్షన్‌ ప్లాన్‌ రూపొందించనున్నారు. ఓఆర్‌ఆర్‌ (లోపలి)పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోంది.

3 డివిజన్లు / వార్డులకు ఒక ట్యాంకర్‌

నగర శివార్లలోని జవహర్‌నగర్‌, బోడుప్పల్‌, పీర్జాదిగూడ, నిజాంపేట నగరపాలక సంస్థలతో పాటు కొంపెల్లి, మేడ్చల్‌, దుండిగల్‌, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం , ఘట్కేసర్‌ మున్సిపాలిటీల పరిధిలోని 3 డివిజన్లు/వార్డులకు ఒక వాటర్‌ ట్యాంకర్‌ను కేటాయించనున్నారు. అవసరాన్ని బట్టి ప్రైవేట్‌ వాటర్‌ ట్యాంకర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రైవేట్‌ కమర్షియల్‌ బోర్లతోపాటు పట్టణానికి సమీపంలో గుర్తించిన వ్యవసాయ బోర్లను కూడా ఉపయోగించునేలా కార్యాచరణ ఖరారు చేశారు. మంచి నీటి సరఫరా పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ పురపాలక సంఘాల కమిషనర్లతో సహా ప్రత్యేక అధికారులను నియమించారు. వీరందరూ జిల్లా అదనపు కలెక్టర్‌(లోకల్‌ బాడీస్‌)రాధికా గుప్తా నేతృత్వంలో పని చేయనున్నారు. ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్లల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రైవేట్‌ కమర్షియల్‌ ట్యాంకర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక జనాభా కలిగి ఉన్న జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌తోసహా పురపాలక సంఘాల్లో మంచినీటి సమస్య తలెత్తకూడదన్న లక్ష్యంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం పేర్కొంది.

పంచాయతీల్లోనూ పకడ్బందీ చర్యలు

34 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్‌ ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచాయతీల్లోని ఓవర్‌ హెడ్‌ వాటర్‌ ట్యాంకులు, వాటర్‌ ట్యాంకర్లు ఉన్నా, ప్రతి గ్రామానికి అదనంగా రెండేసి చొప్పున వాటర్‌ ట్యాంకర్లను అందుబాటులో ఉంచినట్లు జిల్లా పంచాయతీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే జూన్‌ వరకు మంచినీటి ఎద్దడి నివారణకు ఏ.బీ.సీ యాక్షన్‌ ప్లాన్‌ను రూపొందించిన పంచాయతీ శాఖ అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకునేందుకు పలు వ్యవసాయ బోర్లను గుర్తించినట్లు తెలిసిది. ఇందులో ఘట్కేసర్‌ మండలంలో 38, కీసరలో 12, ఎంసీపల్లిలో 32 , శామీర్‌పేటలో 45, మేడ్చల్‌ మండలంలో 42 వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ బోర్లు ఉన్న భూములు సర్వే నంబర్లతో సహా రైతుల ఫోన్‌ నంబర్లు తదితర వివరాలను జిల్లా అధికార యంత్రాంగం సేకరిస్తోంది.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం


కమ్యూనిటీ సెంటర్‌ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్‌ రజితా రెడ్డి

ఉప్పల్‌: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌ చార్జ్‌ మందుముల పరమేశ్వర్‌ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఉప్పల్‌ కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్‌ నిర్మాణ పనులను కార్పొరేటర్‌ రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. చిరు వ్యాపారుల చిరకాల వాంఛ అయిన కమ్యూనిటి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగూర్‌ బాషా, ఫీరంభి, అల్లా భాషా, ఖాజా మౌలానా, మల్లికార్జున్‌, నవీసాబ్‌, శ్రీను, ఖాధర్‌, సిద్దయ్య, తుమ్మల దేవి రెడ్డి, ఈగ అంజయ్య, తెల్కల మోహన్‌ రెడ్డి, మంద మురళీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్‌ కంట్రోల్‌ అధికారుల సోదాలు


తనిఖీలు చేస్తున్న డ్రగ్‌ కంట్రోల్‌ అధికారులు

ఉప్పల్‌: తెలంగాణ డ్రగ్స్‌ కంట్రోల్‌ అధికారులు ఉప్పల్‌ పరిధిలో సోదాలు నిర్వహించారు. నిబంధనలు పాటించని, లైసెన్స్‌ లేని గోడౌన్లు, మందుల అక్రమ నిల్వల సమాచారంపై సమాచారం అందడంతో పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. లక్ష్మీనారాయణనగర్‌లో వెంకటసురేష్‌ బాబు అనే వ్యక్తి లైసెన్స్‌ లేకుండానే గోడౌన్‌లో అనధికారికంగా మందులు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వీటిలో ఆరు రకాల గడువు ముగిసిన మందులు ఉన్నట్లు తెలిపారు. డ్రగ్స్‌ కంట్రోలర్‌ డైరెక్టర్‌ జనరల్‌ వీబీ కమలాసన్‌ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సోదాల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్‌ ఏజీఎం సతీష్‌, మేనేజర్‌ సందీప్‌

కుషాయిగూడ: కుషాయిగూడ వెంకటేశ్వరస్వామి అలయ సమీపంలో కొనసాగుతున్న యూజీడీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని స్థానికులు, బీజేపీ నాయకుల ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం వాటర్‌వర్క్స్‌ ఏజీఎం సతీష్‌, మేనేజర్‌ సందీప్‌ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్లర్‌ పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఏజీఎంకు ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ కాలం ఉండాల్సిన డ్రైనేజీ నిర్మాణంలో కనీస నాణ్యత లేక పోవడంపై అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఏజీఎం స్పందిస్తూ ఇంకా పనులు పూర్తి కాలేదని తమ పరిశీలనలో గుర్తించిన లోపాలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


హరిజన బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

గౌతంనగర్‌: డివిజన్‌ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్థానిక కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు, బుధవారం ఆయన ఓల్డ్‌ నేరేడ్‌మెట్‌ హరిజన బస్తీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో వీధి లైట్లపై కాలనీ వాసులు ఫిర్యాదు చేయగా ఆయన విద్యుత్‌ అధికారులకు ఫోన్‌ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా వాజ్‌పేయి నగర్‌ సమస్య తీరనుందన్నారు. కార్యక్రమంలో లీలావతి, సాయి, నందు, మురళీ, గోపి పాల్గొన్నారు.

సెయింట్‌ పీటర్స్‌లో ఏఐపై సదస్సు


ఎన్‌ఐటీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సెయింట్‌ పీటర్స్‌ కళాశాల ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఏఐ ఫర్‌ సెక్యూరిటీ అండ్‌ సెక్యూరిటీ ఫర్‌ ఏఐ, డిజిటల్‌ ట్విన్‌ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీఎస్‌సీ, ఏఐఎంఎల్‌, ఆర్‌ అండ్‌ డి విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎన్‌ఐటీ జైపూర్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ రమేశ్‌ బాబు మాట్లాడుతూ కంప్యూటర్‌ సెక్యూరిటీ సమస్యలు, సోషల్‌ మీడియాలో వచ్చే రీల్స్‌పై అవగాహన కల్పించారు. మనం చూసే సమయాన్ని బట్టి ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ వీడియోలను అందిస్తుందన్నారు. ఏఐకి సెక్యూరిటీ ఇవ్వడంలో డిజిటల్‌ ట్విన్‌ ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జెఆర్‌ఎఫ్‌ అండ్‌ ఎన్‌ఐటీ జైపూర్‌ ఇంటర్న్‌షిప్‌ ప్రాజెక్టుల్లో సెయింట్‌ పీటర్స్‌ కళాశాల విద్యార్థులు పనిచేసేలా ఒప్పదం కుదుర్చుకున్నారు. కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, ప్రిన్సిపాల్‌ శ్రీలత, డైరెక్టర్లు సరోజా రెడ్డి,అనురాగ్‌ రెడ్డి, కోఆర్డినేటర్స్‌ అమజాన్‌ షేక్‌, వెంకట్‌, పిఆర్‌ఓ రవి సుధాకర్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం


నాచారంలో బీజేపీ ఆధ్వర్యంలో..

మల్లాపూర్‌: ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత యువతపై ఉందని నాచారం డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్‌కుమార్‌ అన్నారు. బుధవారం నాచారంలో శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌ మాట్లాడుతూ శివాజీ జీవితాన్ని యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌ నాయకుడు ప్రకాష్‌, జిల్లా కిసాన్‌ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు అభిషేక్‌ గౌడ్‌, చంద్రమౌళి,వెంకటేష్‌.అమరనాథ్‌, రవికాంత్‌, మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో..

నాచారం వైజయంతి థియేటర్‌ వద్ద నాచారం కాంగ్రెస్‌ నాయకుడు గద్ద క్రాంతికిషోర్‌ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్‌ జయంతిని నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాచారం డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు బందారం శ్రీకాంత్‌గౌడ్‌, కృష్ణారెడ్డి వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నూతలకంటి రాజు.ప్రధాన కార్యదర్శి మహేష్‌ యాదవ్‌, సంతోష్‌ రెడ్డి, చందు. వెంకటేష్‌,బండారు రఘు సునీల్‌రెడ్డి, ,ఏర్పుల సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

రామంతాపూర్‌: ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం రామంతాపూర్‌ టీవీ స్టూడియో సమీపంలోని శివాజీ విగ్రహానికి కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్‌ స్ఫూర్తితో యువత దేశ సంస్కృతి, సంప్రదాయాలు, హిందూ మత ఔన్నత్యాన్ని పరిరక్షించడానికి కంకణ బద్దులు కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు తిండేరు హనుమంతరావు, బండి పద్మ, సోమశేఖర్‌గౌడ్‌, జగదీష్‌, నరసింహ, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు


శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌


వివేకానంద రైజింగ్‌ సొసైటీ ఆధ్వర్యంలో..